క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొవ్వ: మండలంలోని అయ్యంకి, మొవ్వ, కోసూరు, కాజ గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం రెండు గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రమేష్ బాబు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: రెండో శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు పురస్కరించుకుని పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డీఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో వేలం పాట

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ సన్నిధిలోని వివిధ హక్కులను పొందేందుకు శుక్రవారం ఈఓ కానూరి సురేష్ వేలం పాట నిర్వహించారు. శానిటేషన్ సరుకుల సరఫరాను మచిలీపట్నంకు చెందిన శ్రీ వెంకటేశ్వర జనరల్ స్టోర్స్ వారు దక్కించుకున్నారని ఈఓ తెలిపారు. అమ్మవారి సన్నిధిలో ఫొటోలు తీసుకునే హక్కు వేలం పాటకు సంబంధించి ఎవరూ పాల్గొనని కారణంగా వాయిదా వేసినట్లు సురేష్ తెలిపారు. ఈ టెండర్లను మచిలీపట్నం తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భట్లపెనుమర్రులో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సర్వే

భట్లపెనుమర్రు(మొవ్వ): మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామంలో శుక్రవారం డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ బృందం సర్వే నిర్వహించారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో ఆరోగ్య తీరుతెన్నులపై రెండు బృందాలుగా వేర్వేరుగా సర్వే చేశారు. బీపీ, షుగర్ తదితర పరీక్షల నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జే గీతాబాయి, డీఈహెచ్ఎన్ బి.దీవెనమ్మ, ఎస్ఓలు ఆనంద్, అరుణ, ఎస్ఆర్‌హెచ్ఎం డీ శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ డి.విజయ్‌కుమార్, ఏఎస్ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లక్ష్మణరావు సేవలు అభినందనీయం

పామర్రు: ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పుట్టినరోజు పురస్కరించుకుని పామర్రు ఘంటసాల కళాపీఠం సభ్యులు శుక్రవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాపీఠం గౌరవాధ్యక్షుడు కోటి పాండురంగారావు, కార్యదర్శి నందిపాటి హేమంత్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా సెక్రటరీ లంక నరేంద్ర పాల్గొన్నారు.

అక్షర పట్టికల పంపిణీ

గుడివాడ టౌన్: విద్యార్థులకు సులువైన విధానంలో విద్యనభ్యసించేందుకు ఉపయోగపడే అక్షర పట్టికలను ప్రైమరీ పాఠశాలలకు అందజేసినట్లు రోటరీక్లబ్ గుడివాడ అధ్యక్ష కార్యదర్శులు టీఎస్. రాజశేఖర్, జి.కిరణ్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక బాలకృష్ణనగర్, పిన్నమనేని నగర్ ప్రైమరీ పాఠశాలలలో తెలుగు అక్షరాలు, తెలుగు గుణింతాలు, అచ్చులు, హల్లులు, ఆంగ్ల సంఖ్యలు, గణిత పట్టికలు అందజేసినట్లు పేర్కొన్నారు. రోటరీక్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించామని అందులో భాగంగానే ఈ పంపిణీ జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు సూర్యనారాయణ, నాగబాబు, పూర్వ అధ్యక్షుడు ఎం.రమణమూర్తి, సభ్యులు ఏజే ప్రసాదు పాల్గొన్నారు.

విద్యాదానం మిన్న



మండవల్లి: అన్ని దానాల కంటే విద్యాదానం మిన్న అని ఎంఈఓలు రామారావు, సుధానందం అన్నారు. మండలంలోని పెరికెగూడెం ప్రాథమికోన్నత పాఠశాల్లో శుక్రవారం వెన్నార్ సిరామిక్స్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో రూ.70 వేల విలువైన 1,000 నోట్ పుస్తకాలను వారు పంపిణీ చేశారు. హెచ్ఆర్ ఏజీఎం వి.శ్రీనివాస్, హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన వేలం పాట

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి చెందిన వివిధ అంశాలకు సంబంధించి నిర్వహించిన వేలం శుక్రవారం ముగిసింది. ఆలయంలో కోడిగుడ్లు పోగు చేసుకునేందుకు, ఆవు పాలు, కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు అమ్ముకునేందుకు బహిరంగ వేలంపాటలు నిర్వహించగా రూ.4,52,000 ఆదాయం వచ్చింది. వాహనాల పార్కింగ్ రుసుం వసూలు చేసేందుకు వేలం నిర్వహించగా రూ.4.12 లక్షల ఆదాయం లభించింది. సి-షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఒక షాపునకు వేలంపాట నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో డివిజన్ ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో మండవల్లి రైల్వేస్టేషన్



మండవల్లి రైల్వేస్టేషన్



స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఓవర్ బ్రిడ్జి

మండవల్లి: మండవల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధిపథంలో పయనిస్తోంది. భీమవరం-మోటూరు మధ్య ఇంత సుందరంగా ఉన్న రైల్వేస్టేషన్ లేదని పలువురు పేర్కొనడం గమనార్హం. ఈ రైల్వేస్టేషన్ నుంచి విజయవాడ, భీమవరం, గుడివాడ తదితర పట్టణాలకు నిత్యం ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు వందలాది మంది ప్రయాణం చేస్తారు. నెలకు లక్షలాది రూపాయల ఆదాయం ఈ స్టేషన్ ద్వారా రైల్వేశాఖకు సంక్రమిస్తుంది.

ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు

మండవల్లి రైల్వేస్టేషన్ సర్వాంగసుందరంగా ఉంది. ఇక్కడ రెండే ఫ్లాట్‌ఫారాలు ఉన్నప్పటికీ ఎప్పుడు ఏదోఒక రైలు, లేదా గూడ్సు ప్రయాణిస్తూ ఉంటాయి. దీంతో ఎలాటి ప్రమాదాలు జరుగకుండా ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. దీంతో స్టేషన్ నుంచి వేరొక ఫ్లాట్‌ఫారం మీదకు ప్రయాణికులు సునాయాసంగా చేరుతుంటారు.

షెల్టర్ల నిర్మాణం

రైలు వచ్చే వరకు వేచి ఉండేందుకు షెల్టర్లు నిర్మించారు. దీంతో రైలు రావడం ఆలస్యం అయినా ప్రయాణికులు, ఎండకు వానకు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఇక్కడ వేచి ఉంటున్నారు.

గతంలో ఎన్నో సమస్యలు

స్వాతంత్య్ర సిద్ధికి ముందు ఏర్పాటు చేసిన స్టేషన్ వల్ల గతంలో ప్రయాణికులు పలు సమస్యలు ఎదుర్కొనేవారు. బంగళా పెంకుటింట్లో స్టేషన్ ఉండేది. అందులోనే స్టేషన్ మాస్టర్ టిక్కెట్లు అందజేసేవారు. అక్కడ ఉన్న ప్రయాణికులు ఎండకు ఎండి వానకు తడిసేవారు. దీంతో పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చేది.

అధిక శాతం మంది ఇక్కడికే..

మండల కేంద్రం కావడంతో సమీప గ్రామాల్లో రైల్వే సౌకర్యం ఉన్నా అధికశాతం వారు ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడ నుంచి రైల్లో వ్యాపారాలు చేసే వర్తకులు నిత్యం సీజన్ టికెట్‌పై తిరుగుతుంటారు. స్టేషన్ అభివృద్ధి చెందడంతో ఎలాటి అసౌకర్యం లేకుండా ప్రయాణికులు ప్రయాణం సాగిస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. ఏలూరు రోడ్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీపై ప్రజల్లో ఇప్పటికీ ఆదరణ తగ్గలేదన్నారు. గెలుపోటములు సహజమని తెలిపారు. ప్రజా తీర్పును అందరూ గౌరవించాలన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తానని తెలిపారు.

రెండో రోజుకు చేరిన యోగా తరగతులు



కైకలూరు/మండవల్లి: లోకుమూడిగరువు దత్తాశ్రమంలో యోగా తరగతులు శుక్రవారానికి రెండో రోజుకు చేరాయి. మైసూరు దత్త క్రియా యోగా అంతర్జాతీయ కేంద్ర యోగా గురువులు కామేశ్వరశర్మ, చక్రధారి ఔత్సాహికులకు పలు ఆసనాలను నేర్పారు. యోగా, ధ్యానం వల్లే కలిగే ప్రయోజనాలను వివరించారు. దత్తాశ్రమ నిర్వాహకులు గురజాడ ఉదయశంకర్ మాట్లాడుతూ శనివారంతో మూడు రోజుల యోగా శిక్షణ ముగిస్తుందని తెలిపారు. ఔత్సాహికులు నేర్చుకున్న యోగాసనాలను ఇతరులకు నేర్పించాలని కోరారు.

సరైన చికిత్సతో ఇస్కమిక్ స్ట్రోక్ నివారణ



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణకుమార్

గుడ్లవల్లేరు: ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు ఇస్కమిక్ స్ట్రోక్ సంభవించడమే రెండో ప్రధాన కారణంగా చెప్పవచ్చని ఇలిగోస్ చికాగో విశ్వవిద్యాలయం హెండర్సన్ ప్రొఫెసర్ ఇన్ న్యూరో సైన్సెస్ డాక్టర్ కృష్ణకుమార్ వీరవల్లి అన్నారు. 'గ్లోబల్ పర్‌స్పెక్టివ్స్ అండ్ ఫ్యూచర్ డైరెక్షన్స్ ఇన్ ఇస్కమిక్ స్ట్రోక్' అనే అంశంపై గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల్లో శుక్రవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 శాతం ఇస్కమిక్ స్ట్రోక్ తీవ్రతను సరైన చికిత్స ద్వారా నివారించవచ్చని తెలిపారు. ఈ చికిత్సలో టిష్యూ ప్లాస్మినోజస్ యాక్టివేటర్(టీపీఏ) రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించడంలో సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. టీపీఏ వలన దుష్ప్రభావాలు ఉన్నాయని చెప్పారు. వాటిని తగ్గించేందుకు తాను పరిశోధన చేస్తున్నానన్నారు. విద్యార్థులు పరిశోధన వైపు కూడా మక్కువ పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆయన్ను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు జ్ఞాపికను అందించి సన్మానించారు. అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ పి.రవీష, డాక్టర్ టి.ప్రశాంతి, డాక్టర్ బి.మోహన్‌గాంధీ, డాక్టర్ బాలకృష్ణ, బి.సత్యశ్రీ, టి.శ్రావణి, వి.ఎల్.వినోద్‌కుమార్, కె.పరిమళ, డాక్టర్ వి.రజని పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

పామర్రు: పామర్రు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఎన్టీఆర్ ట్రస్టు వారి సౌజన్యంతో ఈ నెల 14వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సీవీ రాఘవేంద్రరావు శుక్రవారం తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగరు పరీక్షలతో పాటు కంటి, వినికిడి, దంత, గుండె సంబంధిత పరీక్షలు, ఏకో, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక కేడీసీసీ బ్యాంక్ ఎదురుగా ఉన్న సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కౌలు కార్డుతో యాజమాన్య హక్కులకు నష్టం లేదు



వేమవరప్పాడులో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ గంగాధరరావు

కైకలూరు: కౌలు కార్డుల వల్ల భూ యజమానుల హక్కులకు ఎటువంటి నష్టం వాటిల్లదని వ్యవసాయశాఖ ఏడీ ఆర్.గంగాధరరావు తెలిపారు. వేమవరప్పాడు పంచాయతీలో పంటసాగుదారు హక్కు పత్రం (కౌలు గుర్తింపు కార్డులు)పై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఏడీ మాట్లాడుతూ కౌలు కార్డు కేవలం 11 నెలల పరిమితితో కౌలు రైతుకు జారీ చేస్తారన్నారు. కౌలు రైతులు ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటో, సాగు చేసే భూయజమాని పొలం పాస్‌బుక్ జిరాక్స్‌ను గ్రామ రెవెన్యూ అధికారి, వీఏఏకు అందజేయాలన్నారు. ప్రస్తుతం వరి పైరులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి ఆర్.దివ్య మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు కౌలు చేసే భూ యజమాని అంగీకారంతో కౌలు కార్డు తీసుకోవాలన్నారు. ఈ కార్డుతో కౌలు రైతుకు వ్యవసాయశాఖ ద్వారా అమలు చేసే వివిధ పథకాలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు పంట నష్టం పొందేందుకు, పంట రుణాలకి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా ఈ పంట సాగుదారు హక్కు పత్రాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో వేమవరప్పాడు ఉప సర్పంచ్ జాజుల రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పమిడిముక్కల: లంకపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని ఆ పార్టీ నాయకుడు కొడాలి రాంబాబు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పిల్లి విజయ్‌బాబు అనారోగ్యంతో మృతిచెందారు. విజయ్‌బాబు కుటుంబాన్ని పార్టీ నాయకులు రాంబాబు శుక్రవారం పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5,000 సాయం అందజేశారు. అదేవిధంగా గత వారం అప్పారావుపేటలో మృతిచెందిన గండ్రపు రత్తయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5,000 సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వేమూరి రమేష్, కనుమూరి వెంకటేశ్వరావు, గండ్రపు స్వరూపరావు, చిన్నం రమేష్, పిల్లి జయరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు సాయం అందజేస్తున్న నాయకులు

ముదినేపల్లి రూరల్: పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు దాతలు ఆర్థిక సాయం అందించడంతో పాటు మరో 450మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలోని గురజకు చెందిన యలమంచిలి వీరరాఘవయ్య జ్ఞాపకార్థం కుమారుడు నాగేశ్వరరావు, కుటుంబసభ్యులు గురజ హైస్కూల్లో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన బొర్రా సుహాస్, పుట్టా నాగ శిరీషకు ఉన్నత చదువుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.30వేలు వంతున హైస్కూల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అందించారు. ఈ విద్యార్థులు ఉన్నత విద్యను పూర్తి చేసేంత వరకు సాయాన్ని కొనసాగిస్తామని పాఠశాలలో జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక నిక గుడివాడ రోటరీక్లబ్ తరఫున గ్రామంలోని రెండు ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలకు చెందిన 450 మంది విద్యార్థులకు రూ.75 వేలు విలువైన నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.కృష్ణమోహనరావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు టీఎస్‌రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణబాబు, ఎ.మారుతికుమార్, అడుసుమిల్లి రామకృష్ణ, జనార్ధన ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే గ్రామానికి చెందిన ఉప్పలపాటి శ్రీధర్ హైస్కూల్‌కు రూ.30 వేలు విలువైన ప్రింటర్‌ను అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని కోమర్రు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు శుక్రవారం నోటు పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని అందజేశారు. గ్రామానికి చెంది హైదరాబాద్‌లో నివాసముంటున్న ఎస్.నాగేశ్వరరావు, ప్రవీణా బడి రుణం తీర్చుకుందాం కార్యక్రమంలో భాగంగా వీటిని పంపిణీ చేశామని తెలిపారు.

నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనాలు నడిపే ప్రతి ఒక్క వాహనదారుడు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గుడివాడ టూటౌన్ ఎస్ఐ పి.నాగరాజు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఏజీకే మున్సిపల్ పాఠశాలలోని విద్యార్థులకు భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగుచక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తూము తొలగింపు

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు గ్రామ సమీపంలో క్యాంపు బెల్ కాలువ నుంచి వైవాక, కలిదిండి మండలం ఆవకూరు, కొచ్చెర్ల గ్రామాలకు తాగు, సాగు నీరందించే పంటకాలువకు దేవపూడి వద్ద ఏర్పాటు చేసిన తూమును నీటి పారుదలశాఖ అధికారులు శుక్రవారం తొలగించారు. దేవపూడి వద్ద ఆ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు గతంలో పంట కాలువకు తూము ఏర్పాటు చేశారు. దీనివల్ల వైవాక, ఆవకూరు, కొచ్చెర్ల గ్రామాలకు నీరందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అనధికారికంగా ఏర్పాటు చేసిన ఈ తూమును తొలగించాలంటూ గ్రామస్తులు అధికారులకు మొరపెట్టుకున్నారు. స్పందించిన నీటి పారుదల శాఖ ఏఈ సిద్ధార్థ పోలీసు బందోబస్తు నడుమ పొక్లెయిన్‌తో తూమును తొలగించారు.

వ్యాధుల నివారణపై అవగాహన



కైకలూరు: ఆరోగ్యశాఖ అమలు చేస్తోన్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా తామరకొల్లు గ్రామంలో సీతనపల్లి పీహెచ్‌సీ హెల్త్ స్టాఫ్, పంచాయతీ సిబ్బంది మలేరియా, జ్వరాలు రాకుండా ప్రజలకు ఇంటింటికీ వెళ్లి జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం నీరు నిల్వ ఉండే పలు ప్రాంతాలను గుర్తించి ఎబేట్ మందును పిచికారీ చేశారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ భట్రాజు శివాజీ, సెక్రటరీ మేక వినయ్ రవికిరణ్, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, ఎంపీహెచ్ఈఓ జి.శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ కె.తాతరావు, హెల్త్ అసిస్టెంటు జి.మాధవరాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి

గుడ్లవల్లేరు: వర్షాకాలంలో గ్రామంలో ఎలాంటి అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తల చర్యలుగా పారిశుద్ధ్య పనులను చేపట్టినట్లు కౌతవరం గ్రామ కార్యదర్శి సీహెచ్.ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం గ్రామంలోని వివిధ వీధుల్లో పారిశుద్ధ్య కార్మికులతో బ్లీచింగ్ చల్లించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కైలే అనిల్‌కుమార్



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గుంటూరు జిల్లా తాడేపల్లిలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అనిల్‌కుమార్ వివరించారు.

-పామర్రు

హెల్మెట్ విధిగా ధరించాలి

జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి



మాట్లాడుతున్న న్యాయమూర్తి సుధారాణి

గుడివాడ టౌన్: వాహనదారుడు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అని జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల్లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయనేది ఊహించలేమన్నారు. మానవ శరీర భాగాల్లో తల ముఖ్యమైన భాగమని దానికి రక్షణ కల్పించాలన్నారు. హెల్మెట్ ధరించి ప్రమాదాలకు గురైన వారిలో ఒక్క శాతం మరణాలు కూడా నమోదు కాలేదని ఆమె అన్నారు. భయంకర ప్రమాదాల్లో సైతం 80 శాతం ప్రాణాపాయ స్థితినుంచి బయటపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. కావున ద్విచక్ర వాహనదారులు ఈ విషయాన్ని గమనించి హెల్మెట్ వాడకం తప్పనిసరి చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అజయ్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు, ట్రాఫిక్ ఎస్సై, వన్ టౌన్, టూ టౌన్ ఎస్సైలు పాల్గొన్నారు.

తాగునీటి బోర్ పనులు ప్రారంభం



తాడంకిలో తాగునీటి బోర్ పనులను ప్రారంభించిన సర్పంచ్ ధనలక్ష్మి

పమిడిముక్కల: మండలంలోని తాడంకి గ్రామంలో నూతన తాగునీటి బోర్ పనులను శుక్రవారం సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన వాటర్‌ట్యాంక్ బోర్ పూర్తిగా పాడైపోయిందన్నారు. ఈ సమస్యను ఎంపీపీ కాసాని వేద సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణ కుమారి, ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభానీ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు సమస్యను తెలియజేశానన్నారు. దీంతో మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో బోర్ పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణ, వార్డు సభ్యుడు పురుషోత్తం, కూచిపూడి వీరాస్వామి, మండా చినబాబు పాల్గొన్నారు.

తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి



మొవ్వ పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

మొవ్వ: తాగునీటి విషయంలో పంచాయతీలు పూర్తి స్థాయిలో జాగ్రత్తలు వహించాలని కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జే గీతాబాయి స్పష్టం చేశారు. ఆమె శుక్రవారం మొవ్వ మండలం భట్లపెనుమర్రులోని ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, ప్రజారోగ్యంపై కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీలు ప్రతి 15 రోజులకు ఓ సారి తాగునీరు సరఫరా చేసే ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వైరల్ జ్వరాల వ్యాప్తి చెందుతున్నాయని, తమ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య సమాచారం తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న రోగులను, రికార్డులను పరిశీలించారు. ఈమెతో పాటు డాక్టర్లు ఎం వేదరాజ్, సీహెచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు ఎంపిక



దీక్షిత సుష్మ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. గురువారం వెలువడిన ట్రిపుల్ ఐటీ ప్రవేశ ఫలితాల్లో తమ పాఠశాలలో చదివిన పి.దీక్షిత, బి.సుష్మ సీట్లు పొందినట్లు చెప్పారు. దీక్షిత పదో తరగతి పరీక్షల్లో 583, సుష్మ 582 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను హెచ్ఎంతో పాటు సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు అభినందించారు.